క్లుప్తంగా

11న నీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

పాతపట్నం: పాతపట్నంలోని నీలకంఠేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 11న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈవో టి.వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చనలు, సాయంత్రం ఐదు గంటలకు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాగుపై అవగాహన పెంచుకోవాలి

ఎల్.ఎన్.పేట: పంటల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి పైడి లతశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖరీఫ్ వరి సాగులో అధిక దిగుబడులను సాధించేందుకు రైతులకు సూచనలు చేస్తునే అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు, విత్తన మార్పిడి, విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, సాగునీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. పెట్టుబడి తగ్గిస్తూనే అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు సాగు పద్ధతులు పాటించాలన్నారు. విత్తనాల కోసం ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకునేలా రైతులు ముందుకు రావాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని లబ్బ గ్రామానికి చెందిన రైతులు పొలాల్లో చేస్తున్న ఎల్‌డీపీ ఉపాధి పనులను ఎంపీడీవో త్రివిక్రమరావు శుక్రవారం పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే గరిష్ట వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

మంచినీటికి ఇబ్బందులు!


కుళాయి ద్వారా నీరు రాకపోవటంతో ఖాళీగా ఉన్న బిందెలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న మెగా రక్షిత నీటి పథకం నుంచి సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదు. దీంతో పలు గ్రామాలకు చెందిన ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. తురకపేట, తురకపేట సెంటర్, మల్లికార్జునపురం, బొర్రంపేట, ధనుకువాడ, రావిచంద్రి, సిద్ధాంతం, సుంతాపురం, కృష్ణాపురం తదితర గ్రామాలకు నీరు అందటం లేదని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి నీటిని అందించాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో రహదారి


శిథిలమైన రోడ్డు

సారవకోట: మండలంలోని వడ్డినవలస నుంచి జలుమూరు మండలం కొమనాపల్లి వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారి విస్తర్ణ పనుల నిమిత్తం పలు చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేశారు. అయితే ఆ పనులు పూర్తికాక మధ్యలో నిలుపుదల చేసేశారు. రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఈ రోడ్డుపై ప్రయాణానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిఠాయిలు పంపిణీ


మిఠాయిలు పంపిణీ చేస్తూ నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఆమదాలవలస: ఆమదాలవలస ఎమ్మెల్యేగా కూన రవికుమార్ విజయం సాధించిన నేపథ్యంలో టీడీపీ శ్రేణులు శుక్రవారం మిఠాయిలను పంచిపెట్టారు. పట్టణంలోని 16వ వార్డు పరిధి దాబాలవారి వీధి, శివన్నారాయణ క్వార్టర్స్, కూరగాయల మార్కెట్ వీధులలో టీడీపీ మాజీ కౌన్సిలర్ గుడ్ల రాజ్యలక్ష్మి, దుర్గాప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. వార్డులో ఉన్న 540 ఇళ్లకు ఒక్కో మిఠాయి బాక్సును పంపిణీ చేశారు. నాయకులు శిల్లా గురునాథరావు, పెళ్లూరి రవికుమార్, పొట్నూరు హరి, బగాది భాస్కరరావు, పాండు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు


పాతపట్నం: బహుమతులు పొందిన విద్యార్థులతో అధికారులు

నరసన్నపేట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వక్తలు అన్నారు. గ్రంథాలయాల్లో 20 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. గ్రంథాలయాలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని గూడ్స్‌అండ్ టాక్స్ ఆఫీసర్ వి.రమ అన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. సెలవు రోజుల్లో విద్యార్థులు ఆటలకే పరిమితం కాకుండా ఇలా గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం మంచిదన్నారు. వేసవి శిబిరం సందర్భంగా లైబ్రేరియన్ చాయ్‌రతన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు రమ బహుతులు అందజేశారు.

పాతపట్నం: శాఖా గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాతపట్నం గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ జి.వేణుగోపాలరావు, విశ్రాంత ఎంపీడీవో ఎస్.చిరంజీవులు, ఏపీజీవీబీ మేనేజర్ం బాబూరావు, రామరాజు చారిబుల్‌ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు హాజరై విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి కె.రాజు మాట్లాడుతూ.. వేసవి శిబిరం నిర్వహణకు సహకరించిన రిసోర్స్ పర్సన్లు, అతిథులకు కృతజ్ఞతలు తెలిజయజేశారు.


మెళియాపుట్టి: బహుమతులు పొందిన విద్యార్థులు, అధికారులు


నరసన్నపేట: బహుమతి పొందిన విద్యార్థులతో గూడ్స్‌అండ్ టాక్స్ ఆఫీసర్ రమ, లైబ్రేరియన్

మెళియాపుట్టి: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్, క్యారమ్స్, లెమన్ స్పూన్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈవో దేవేంద్రరావు, నలంద ప్రిన్సిపాల్ ప్రతాప్‌లు మాట్లాడుతూ.. గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవడానికి చక్కటి అవకాశం లభిస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి తరచూ గ్రంథాలయాలకు వస్తూ.. పుస్తక పఠనం అభ్యాసం చేసుకోవాలని అన్నారు. విద్య ఎంత అవసరమో చక్కటి గొప్ప కథలు చరిత్రలు, దేశం కోసం త్యాగాలు చేసిన నాయకుల జీవితచరిత్రలు తెలుసుకోవడం కూడా అంటే అవసరమని అన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మహిళా పోలీస్‌భారతి, పలువురు యువకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ


రాజేశ్వరరావు, ఏవో

బూర్జ: రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీకి చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయశాఖాధికారి వి.రాజేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సోనా, సాంబ, స్వర్ణమసూరి, మార్టేరుసాంబ, శ్రీద్రుత, ఇంద్ర, అమరు, శ్రీకాకుళం సన్నాలు (ఆర్జీఎల్ 2538) రకాలు, కొత్తరకాల విత్త నాలు ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలు రాయితీపై రైతులకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. పాతరకం విత్తనాలైన స్వర్ణ, సాంబ, సోనా ఒక్కో కిలో రూ. ఐదు, కొత్తరకం కిలో పది రూపాయల చొప్పున సబ్సిడీపై సరఫరా చేస్తోందన్నారు. పాస్ బుక్, కులధ్రువీకరణ సర్టిఫికెట్ ఉన్న ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తామని వివరించారు. ఆసక్తి గల రైతులు ఆర్బీకేలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రాయితీపై పత్తి విత్తనాలు అందజేయాలి

కొత్తూరు: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, భామిని, సీతంపేట తదితర మండలాల్లో పత్తి సాగు చేస్తున్న రైతులకు రాయితీపై విత్తనాలు ప్రభుత్వం పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో వరి తరువాత ప్రధాన పంటగా పత్తిని రైతులు సాగు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ వర్తకుల వద్ద పత్తి విత్తనాలను అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి రాయితీపై పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రసాదరావు కోరారు.

పశువైద్యసేవలు వినియోగించుకోవాలి


సిబ్బందితో మాట్లాడుతున్న కరుణాకరరావు

పాతపట్నం: సంచార పశువైద్య సేవలు పాడి రైతులంతా వినియోగించుకునేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పంచు కరుణాకరరావు కోరారు. స్థానిక పశువైద్యకేంద్రంలో సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంచార వాహనం రోజూ ఏడు నుంచి ఎనిమిది ట్రిప్పులు తిరిగేలా మొబైల్ సిబ్బంది ప్రణాళికలు వేసుకోవాలన్నారు. వాహనంలో అన్ని మందులు ఉన్నాయా లేదో ముందుగానే సరిచూసుకోవాలని సూచించారు. గ్రామాలను సందర్శించిన తరువాత వైద్యానికి కావాల్సిన అదనపు మందులు ఆర్బీకే సిబ్బందికి ఇవ్వాలన్నారు. సమావేశంలో పశువైద్యులు పి.అనిల్, మౌనిక, హరిష్, సిబ్బంది విజయకుమార్, మోహన్‌నారాయణ, తారకేశ్వరరావు, రమణ ఉన్నారు.

భూలోక మాత ఉత్సవాలకు పందిరిరాట


పందిరిరాట వేస్తున్న మహిళలు

టెక్కలి: స్థానిక భూలోకమాత వీధిలో ఈ నెల 14 నుంచి జరగనున్న భూలోకమాత ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం పందిరిరాట వేశారు. మాజీ సర్పంచ్ బెహరా కృష్ణవేణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల నేతృత్వంలో అమ్మవారికి పూజలు చేసి పందిరిరాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ముర్రాటలతో చల్లదనం చేశారు.

సుదర్శన క్రియతో ప్రశాంతత


మాట్లాడుతున్న జిల్లా ప్రతినిధి డాక్టర్ అమ్మన్నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ సెంటర్‌లో సుదర్శన క్రియపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు యోగా టీచర్ దేసూళ సురేంద్ర తెలిపారు. ఈ నెల 11 వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. శ్వాసకు సంబంధించి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సుదర్శన క్రియ సాధనతో మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని, ఒత్తిడి లేని జీవితం సొంతమవుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు తెలిపారు. రోజులో రెండు పూటలు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణలో పాల్గొనదలచిన వారు 79897 52675 నంబరును సంప్రదించాలని కోరారు.

వైభవంగా చింతామణి సంబరం

కవిటి: ఉద్దాన ప్రజల ఆరాధ్యదైవం, కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి కవిటి పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చల్లదనం ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్ద, కాళీమాత వేషధారణలు, మేళతాళాలతో ఊరేగించారు. గ్రామశివారులోని చింతామణి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సంతోషిమాతకు పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత ఆలయంలో జేష్ఠమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వరి విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

కవిటి: వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై వరి విత్తనాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. వివిధ గ్రామ సచివాలయాల్లో ఖరీఫ్ సాగు నేపథ్యంలో వరివిత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. దీనిలో భాగంగా శుక్రవారం కవిటి, జగతి తదితర సచివాలయాల పరిధిలో రైతులు వరివిత్తనాల కోసం వివరాలు రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 7029, మార్టూరు 1318, బీపీటీ 5204(సాంబమసూరి), ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) రకాలను రైతులకు కిలోకు రూ.10 రాయితీపై అందించేందుకు వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రకటించిన విషయం తెలిసిందే. రైతులు అవసరమైన విత్తనాల కోసం ఆర్బీకేల వద్ద నమోదు చేసుకోవాలని కోరుతున్నారు.

వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య!


కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద నిలిచిన వాహనాలు (ఫైల్)

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రజలు పలువిధాలుగా ఇక్కట్లు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం రోడ్డును వెడల్పు చేసింది. అయితే వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. దీనికితోడు ప్రధాన రోడ్డును ఆనుకొని చాలామంది వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో సమస్య మరింత వెంటాడుతోందని స్థానికులు చెబుతున్నారు. సీతంపేట, భామిని, హిరమండలం మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన కాశీనగర్, హడ్డుబంగి తదితర గ్రామాలకు ఇదే మార్గంలో వెళ్లాలి. దీంతో వాహనాల రద్దీ పెరిగింది. కొత్తూరు మీదుగా ఒడిశాకు భారీ వాహనాలు వెళ్లడంతో పాటు గ్రానైట్ వాహనాలు ఇదే మార్గంలో వెళ్తుండడంతో సమస్య ఎక్కువైంది. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద వాహనాలు తిరిగేందుకు సైతం ఇబ్బందిగా మారింది. పోలీసులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మీ సేవా కేంద్రాల్లో సేవలు పునరుద్ధరించాలి


ఎమ్మెల్యే రమణమూర్తిని సత్కరిస్తున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులు

నరసన్నపేట: మీ సేవా కేంద్రాల్లో పౌర సేవలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని నరసన్నపేట మీసేవా కేంద్రాల నిర్వాహకుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన బగ్గు రమణమూర్తిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. సంఘం ప్రతినిధులు జామి రామకృష్ణ, కామేశ్వరశర్మ, ఈశ్వరరావు, నిమ్మాడ అచ్యుతరావు, శివ, శ్రీను తదితరులు ఎమ్మెల్యేని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. మీ సేవ కేంద్రాల నిర్వహకులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని... ఈ కేంద్రాల్లో సేవలు యథావిధిగా పునరుద్ధరిస్తే వందలాది కుటుంబాలకు మేలు జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో మండల మీ సేవా నిర్వాహకులు మంజునాథ్‌తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు


మెళియాపుట్టి: ఎమ్మెల్యే గోవిందరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో భాస్కరరావు

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యేగా ఎన్నికైన మామిడి గోవిందరావును పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేను అభినందించిన వారిలో కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాలరావు, హిరమండలం ఎస్సై జి.నారాయణస్వామి, మండల పరిషత్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మెళియాపుట్టి: మండలానికి చెందిన పలువురు అధికారులు ఎమ్మెల్యేగా ఎన్నికైన మామిడి గోవిందరావును ఆయన స్వగ్రామం తామర వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎంపీడీవో జి.భాస్కరరావు, ఏవో తిరుపతి పట్నాయక్, ఈవోపీఆర్డీ తారకేశ్వరి, ఉపాధి ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు, పలుశాఖలకు చెందిన అధికారులు ఉన్నారు.


పాతపట్నంలో ఎమ్మెల్యే గోవిందరావును కలిసిన అధికారులు

టీడీపీ విజయోత్సవ ర్యాలీ


హిరమండలం: ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

హిరమండలం: పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు ఎన్నికయ్యారు. దీంతో ఆయనకు మద్దతుగా ఎంజీఆర్ యువసేన అధ్యక్షుడు పోతురాజు శ్రీధర్ ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ హిరమండలంలో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే గోవిందరావు తనయుడు మామిడి గణేష్ పాల్గొన్నారు. పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో 101 కొబ్బరి కాయలు సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సలాన శరత్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, టీడీపీ నాయకులు తూలుగు తిరుపతిరావు, లాడి శ్రీకృష్ణ, చింతాడ గిరి, లంక రామారావు, జి.కామేశ్వరరావు, సాయికృష్ణ పట్నాయక్, టి.రమేష్ పాల్గొన్నారు.

ఫీల్డు అసిస్టెంట్‌ను నియమించాలని విజ్ఞప్తి


వేతనదారులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

బూర్జ: ఫీల్డు అసిస్టెంట్‌ని నియమించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం కోరారు. కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేట గ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్న ప్రదేశాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. లచ్చయ్యపేట గ్రామానికి ఎన్నో ఏళ్ల నుంచి ఫీల్డు అసిస్టెంట్‌ని నియమించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంతే కాకుండా మేట్లను కూడా నియమించాలని కోరారు. టెక్నికల్ అసిస్టెంట్‌తో అక్కడ పనులు నిర్వహించడం సమంజసం కాదన్నారు. అధికారులు స్పందించి ఫీల్డు అసిస్టెంట్, మేట్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు గంగరాపు ఈశ్వరమ్మ, సైరిగాపు వెంకటరావు, కొంచాడ సీతన్నాయుడు, దాసరి మల్లమ్మ, దాసరి నాగమ్మ, కె.రామారావు ఉన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



పలాసపురంలో నవధాన్యాల కిట్లు తయారీ పరిశీలిస్తున్న ఏపీఎం రమణమ్మ

సోంపేట : మండలంలోని రైతులు భూసారాన్ని పెంచుకోవడానికి ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని స్వయం సహాయక సంఘాల ఏపీఎం రమణమ్మ అన్నారు. మండలంలోని పలాసపురంలో యూనిట్ స్థాయిలో నవధాన్యాల విత్తనాల కిట్లు తయారీ కార్యక్రమాన్ని శుక్రవారం ఏపీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ పంటలు సాగు చేసే ముందు నవధాన్యాలు భూమిలో చల్లుకుని, కలియదున్నడం వల్ల అనేక లాభాలు చేకూరుతాయని వివరించారు. వరి పంటకు ముందు 12 కిలోల విత్తనాలు, జీడి మామిడి కొబ్బరి తోటల్లో 6 కిలోల విత్తనాలు చల్లుకోవాలన్నారు. వీటి ద్వారా నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, మొక్కలకు అవసరమైన సూక్ష్మపోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆశీర్వచనంతోనే విజయం

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి దివ్య ఆశీస్సులతోనే తనకు తొలిసారిగా ఎమ్మెల్యేగా అవకాశం రావడంతో పాటు రికార్డు మెజార్టీ దక్కిందని నూతనంగా ఎన్నికైన శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా శుక్రవారం ఆయన ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యుల బృందం సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో పూజలు చేయించిన అనంతరం శంకర్ మామయ్య, దివంగత వరుదు బాబ్జీరావు ఈ ఆదిత్యాలయాన్ని పునర్నిర్మించిన నాటి విశేషాలను స్మరించుకుంటూ చర్చించుకున్నారు. ఈయన వెంట స్థానిక డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఉంగటి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు తెలుగు నాగరత్నం, అంబటి లక్ష్మీరాజ్యం, స్థానిక నేతలు తెలుగు జగదీష్, రాయిపల్లి అర్జున్, కొయ్యాన రామ్మోహన్ తదితరులు ఉన్నారు. అంతకుముందు శంకర్ తొలిసారిగా అరసవల్లి ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ఇంద్రపుష్కరిణి అభివృద్ధికి చేయాల్సిన ప్రగతిపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధిలో అరసవల్లి ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. వెలమ వీధి కూడలి నీలమ్మ గుడిని, శ్రీశయన వీధిలోని విఘ్నేశ్వరాలయాలను దర్శించుకుని ర్యాలీగా వెళ్లారు.